నేడు పాడేరు మోదకొండమ్మ తీర్థం

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు మోదకొండమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని ఈ నెల 29వ తేదీ ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఆలయ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలం నాయుడు తెలిపారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి పర్వదినం అనంతరం అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని నిర్వహిస్తుండటం అనవాయితీగా వస్తోందని, దీంతో ఈ సారి కూడా తీర్థ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తామన్నారు. ఆలయం అవరణలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేస్తామన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం అమ్మవారి పాదాలు, ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పురవీధులలో ఊరేగించనున్నట్లు చెప్పారు. అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి తీర్థ మహోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పివిటిజిల జీవన స్థితిగతులపై అధ్యయనం

బృందం ప్రతినిధులకు సమస్యలు విన్నవించిన సర్పంచ్ త్రినాథ్

సమస్యలు తెలుసుకుంటున్న బృందం ప్రతినిధులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలో మారుమూల ప్రాంతమైన లక్ష్మీపురం పంచాయతీ అర్లాయిపుట్ పివి టిజి గ్రామంలో కేంద్ర గిరిజన సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఎన్ఎస్టిఎఫ్డిసి సెక్రటరీ కుంజు బీహారీ, పిటిజి ఐటిడిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వరరావు, టిసిఆర్టిఎం ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్‌లు శనివారం పర్యటించారు. పివిటిజిల జీవన విధానం, స్థితి గతులు అధ్యయనం చేసేందుకు వీరు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ కొర్ర త్రినాథ్ అధికారులతో మాట్లాడుతూ, పంచాయతీ పరిధి పలు గ్రామాలలో అనుసంధాన రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, అంగన్వాడీ భవనం, కమ్యూనిటీ భవనం, తాగునీటి పథకాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన ప్రాంతంలో గిరిజన రైతులు పండించిన పంటలకు, చిరుధాన్యాలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీల వేతన బకాయిలు తక్షణమే చెల్లించి సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించాలని కోరారు. పివిటిజిలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధికై నివేదికలు సిద్ధం చేయాలన్నారు. అతిమారుమూల ప్రాంతాలలో నివసిస్తున్న పీవీటీజిలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని, నిధులు మంజూరు చేయాలని తెలిపారు. గిరిజనుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో మారుమూల గ్రామాలలో రహదారులు, తాగునీటి వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. పంచాయతీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సచివాలయానికి ఇంటర్నెట్ సౌకర్యం లేక పోవడంతో ప్రతి చిన్న సమస్యను పరిష్కరించుకునేందుకు మండల కేంద్రానికి వెళ్లవలసి వస్తుందని వాపోయారు. ఆధార్ సీడింగ్, తదితర పనులకు పలు గ్రామాల నుండి గిరిజనులు అనేక ఇబ్బందులకు గురవుతూ తహశీల్దార్ కార్యాలయానికి వాహనాలు లేక కాలినడకన నడిచి వెళ్ళవలసిన పరిస్థితి ఎదుర్కొంటునారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పథకాల బుక్‌లెట్‌ను ఇస్తున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

ఎమ్మెల్యే ఫాల్గుణ పర్యటన

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:మండలంలోని కొర్ర పంచాయతీ మామిడివలస, బొర్రపాలెం, పెద్దపాడు గ్రామాల్లో అరకు నియోజకవర్గం ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ శనివారం గడపగడప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన అభివృద్ధిని కాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ఆ గ్రామాల గిరిజనులకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల అమలు తీరుపై గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అందజేయడంలో నిర్లక్ష్యాన్ని వీడి అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బీ.ఈశ్వరి, ఆ పార్టీ మండల నాయకులు బాకా సింహాచలం, ఎం.శ్రీరాములు, శెట్టి గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేయాలి

ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం, గిరిజన సంఘం నేతలు

ఆర్‌బికెల వద్ద ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్న ఎంపిపి

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని గిరిజన రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వపరంగా కొనుగోలు చేసి, వారికి సకాలంలో డబ్బులు చెల్లించాలని ఎంపిపి కారం లక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పెద్దమట్టపల్లి రైతు భరోసా కేంద్రంలో అమ్మకానికి తెచ్చిన ధాన్యం నిల్వలను స్థానిక సర్పంచ్ వెట్టి లక్ష్మి, సిపిఎం, రైతుసంఘం నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో రేఖపల్లి, కందులూరు, పెద్దమట్టపల్లి రైతుభరోసా కేంద్రాల్లో ప్రభుత్వపరంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. ఆయా కేంద్రాల్లో అధికారికంగా రేఖపల్లిలో 500 మెట్రిక్ టన్నులు, పెద్ద మట్టపల్లిలో 700 మెట్రిక్ టన్నులు, కుందులూరులో 700 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేశారని, ఆయారైతులకు ఇంకా డబ్బులు చెల్లించాల్సి ఉందన్నారు. ఈమూడు కేంద్రాల్లోనూ దాదపు వెయ్యి మెట్రిక్ టన్నుల వరకు రైతులు తెచ్చిన ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. పౌరసరఫరాల అధికారులు వీటిని కొనుగోలుకు జాప్యం చేస్తుండడంపై రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి, ఆర్‌బికెల వద్ద ఉన్న ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేయాలని, లేకుంటే రైతులను సమీకరించి సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేయక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, రైతు సంఘం నాయకులు కుంజ నాగిరెడ్డి, వడ్లాది రమేష్, స్థానిక ఎంపిటిసి.పూనెం ప్రదీప్ కుమార్, సర్పంచ్ సంతోష్‌కుమార్, సిపిఎం నేతలు శ్రీరామమూర్తి, కారం సుందరయ్య, గుండెపూడి లక్ష్మణరావు, తుర్రం బాబూరావు, రైతులు పాల్గొన్నారు.

గ్రూప్ - 1 ప్రిలిమినరీలో గిరిపుత్రుల సత్తా

12 మంది మెయిన్స్‌కు అర్హత

ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షల్లో గిరి పుత్రులు సత్తా చాటారు. విశాఖపట్నం వేపగుంట యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటిసి)లో ఐటిడిఎ పిఒ ఆర్.గోపాలక్రిష్ణ కృషితో అందిస్తున్న సివిల్స్ శిక్షణను సద్వినియోగం చేసుకుని గిరిపుత్రులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈనెల 8న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు సివిల్స్ శిక్షణ పొందుతున్న 45 మంది అభ్యర్థులు గ్రూప్-1 పరీక్షలు రాసారు. వీరిలో 12 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు. అర్హత సాధించిన వారిలో టి.ఉదయ్ బాను, ఎస్.శ్రీనివాస్, వి.గోపిచంద్, ఎ.ఉమాసాయి, కె.సూర్యప్రకాష్, ఎవిఎస్ కీర్తి, పి.జయరాం, టి. భాస్కర్, ఎస్.ఇందిర కుమారి, బి.శ్రీహరి నాయుడు, కె.జాన్సీ, బి.నవ్య ఉన్నారు. ఈ సదర్భంగా ఐటిడిఎ పిఒ ఆర్.గోపాలక్రిష్ణ శనివారం అర్హత సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేసారు. మెయిన్స్ లో మంచి ర్యాంకులు సాధించి ఉన్నత స్థానాలు సాధించి అల్లూరి సీతారామరాజు జిల్లాకు, ఐటిడిఎకు మంచి పేరు తీసుకుని రావాలని కోరారు. పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరుస్తున్నారని ఇదే ఉత్సాహంతో ప్రతి ఒక్క గిరిజన విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రయత్నమే విజయానికి మొదటి గెలుపని చెప్పారు. ప్రతి అభ్యర్థి గెలుపు సాధించే వరకు సాధన చేయాలని, ఎవరూ ఎటువంటి నిరాశ, నిస్పృహలకులకు లోనుకాకుండా చదువుకోవాలన్నారు. ఐటిడిఎ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సివిల్స్ లో ర్యాంకులు సాధించే సామర్థ్యం, సత్తా గిరిజన విద్యార్థుల్లో ఉందని ఆనందం వ్యక్తం చేశారు.

పిఒ కృషి అభినందనీయం

సివిల్స్ చదవాలనుకునే ప్రతిభగల పేద, గిరిజన నిరుద్యోగ యువతీ, యువకుల అభ్యున్నతి కోసం ఐటిడిఎ పిఒ ఆర్.గోపాలక్రిష్ణ కృషి అభినందనీయమని టిడబ్ల్యూ టీచర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు అన్నారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షల్లో గిరి పుత్రులు అర్హత సాధించిన సందర్భంగా వారు మాట్లాడుతూ, గిరిజన విద్యార్థులు నైపుణ్యాలు ఉండి కూడా పేదరికంతో ఫీజులు చెల్లించలేక శిక్షణ పొందలేక పోతున్న అలాంటివారికి ఐటిడిఎ ద్వారా ఉత్తమ శిక్షణతో పాటు ఉచిత స్టడీ మెటీరియల్, భోజన వసతి, ఇంటర్నెట్ సౌకర్యాలు కల్పిస్తూ గిరిజన విద్యార్థుల అభ్యున్నతి కోసం పిఒ కృషి చేస్తున్నారన్నారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన గిరిజన అభ్యర్థులను టిడబ్ల్యూటియు రాష్ట్ర నాయకులు రీమలి జాన్, సిహెచ్ శ్రీనివాస్ పడాల్, పి.క్రిష్ణారావు, బావరాజు అప్పారావు, జివివి ప్రసాద్, ఆర్.సూర్యనారాయణ, జిల్లా నాయకులు కె.రామారావు, కె.నీలకంఠం తదితరులు అభినందించారు. మెయిన్స్, ఇంటర్వ్యూలోను ఉత్తీర్ణత సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్

'జల జీవన్ మిషన్' పనులు వేగవంతం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలో లక్ష్మీపురం గ్రామ పంచాయతీలో సర్పంచ్ కొర్ర త్రినాథ్ అధ్యక్షతన శనివారం గ్రామసభను నిర్వహించారు. తాగునీరు, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి హామీ, పారిశుధ్యం వివిధ అంశాలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ, జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా పంచాయతీ పరిధిలో 14 గ్రామాలకు గాను 4 గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పథకాల పనులు ప్రారంభమయ్యా యన్నారు. మిగిలిన 10 గ్రామాల్లో త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించడానికి కృషి చేయాలని పంచాయతీ సచివాలయ సిబ్బందికి సూచించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, అంగన్వాడీ కేంద్ర భవనాలు మంజూరు చేయాలని గ్రామ సభలో తీర్మానించి ప్రతిపాదనలో పెట్టాలని సర్పంచ్ అధికారులను కోరారు. ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో పలుచోట్ల హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణంకు రాష్ట్ర ప్రభుత్వం చాటు మార్గాన్న గ్రామాలలో సభలు నిర్వహించకుండా ప్రతిపాదనలు చేయడంపై సర్పంచ్ అసహనం వ్యక్తం చేశారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వం విరమించాలని, లేనిపక్షంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సభలో పంచాయతీ విస్తరణ అధికారి చిన్న, డీడీఓ సోమేశ్వరరావు, ఉప సర్పంచ్ అర్లబు సత్యం, సెక్రెటరీ ప్రశాంత్, డిఎ దేవేంద్రుడు, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో

అదనపు యూనిట్లకు స్థల పరిశీలన

విద్యుదుత్పత్తిపై జెన్‌కో ఫైనాన్స్ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి ఆరా

స్థల పరిశీలన చేస్తున్న జెన్‌కో ఫైనాన్స్ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో నూతనంగా నెలకొల్పనున్న ఐదు, ఆరు యూనిట్లకు సంబంధించి గుర్తించి, చదునుచేసిన స్థలాన్ని ఎపి జెన్‌కో డైరెక్టర్ (ఫైనాన్స్) వెంకటేశ్వరరెడ్డి వెంకటేశ్వరరెడ్డి సందర్శించారు. శుక్ర, శనివారాల్లో జల విద్యుత్ కేంద్రం పరిధిలో విస్తృతంగా పర్యటించిన ఆయన, శనివారం కొత్త యూనిట్లు నెలకొల్పడానికి సిద్ధం చేసిన ప్రదేశానికి చేరుకొని యూనిట్లు ఏర్పాటుకు సంబంధించి చేపట్టే పనులు, తదితర అంశాలపై ఎపి జెన్‌కో చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్, ఇ.వెంకటేశ్వరరావు, ఇఇ బాబూరావులను అడిగి ఆరా తీశారు. అనంతరం పొల్లూరు జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించి ప్రస్తుతమున్న విద్యుదత్పత్తి, యూనిట్లు పనితీరు తదితర అంశాలపై ఇంజనీర్లతో చర్చించారు. ఐదు, ఆరు యూనిట్లుకు సంబంధించి విలువైన సామగ్రి భద్రపరిచే స్టోర్ రూములను పరిశీలించారు. పలు అంశాలపై కిందిస్థాయి అధికారులను అడిగి ఆరా తీశారు. కొత్త యూనిట్లు ఏర్పాటు పనులు చేపట్టే ముందు, ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు ముందస్తుగానే తీసుకోవాలని చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్‌ను ఆదేశించారు.

కార్యక్రమంలో సీలేరు కాంప్లెక్స్ ఎస్ఇ (సివిల్) కెకెవి. ప్రశాంత్‌కుమార్, ఇఇ బాలకృష్ణ పాల్గొన్నారు.

పొల్లూరు జలవిద్యుత్ కేంద్ర మెయిన్ కంట్రోల్ తనిఖీ

మాట్లాడుతున్న గిరిజన సంఘం నేత శ్రీను

విద్యార్థుల మరణాలపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:విద్యార్థుల మరణాలపైన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎంఎం శ్రీను డిమాండ్ చేశారు.మండలంలో వివిధ ప్రజాసంఘల ఆధ్వర్యంలో స్థానిక సామాజిక భవనంలో సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన వసతి గృహాల్లో ఆరోగ్య కార్యకర్తలను నియమించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థి సంఘాలు ప్రవేశించకుండా జారీ చేసిన జీఓను వెనక్కి తీసుకోవాలన్నారు. గిరిజన సంక్షేమ వసతి గృహాలను మెనూ సక్రమంగా అమలు చేసి విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని తెలిపారు.ఐటీడీఏ పీవో గోపాలకృష్ణని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల సంక్షేమం కోసం కష్టపడి పనిచేసే అధికారిని పాడేరు ఐటీడీఏలో నియమిచాలన్నారు. ప్రజా సంఘాల వేదిక నాయకులపై 144 సెక్షన్ విధించి భయాందోళన చేసేందుకు సిద్ధమవుతున్న ప్రభుత్వ యంత్రాంగం మెడలు వంచేందుకు ఏకం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షుడు గల్లెల నారాయణ, భీమరాజు, లైకోన్, నర్శయ్య, జీనబందు, మహిళ సంఘం (ఐద్వా) మండల అధ్యక్షురాలు సీసా విజయ, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు కొర్ర డోంబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ జిడి.బాబు

మూఢ నమ్మకాలను విడనాడాలి

ప్రజాశక్తి-అరకులోయరూరల్:మండలంలోని పద్మాపురం పంచాయతీ గ్రామ సచివాలయంలో అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ జీడి బాబు ఆధ్వర్యాన శనివారం మీ కోసం మీ పోలీసులో భాగంగా మూఢ నమ్మకాలపై అవగాహన సదస్సు నిర్వహిచారు. సచివాలయం నుండి రాజధాని జంక్షన్ వరకు సచివాలయం సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మూఢనమ్మకాలతో చాలా కుటుంబాలు గొడవలు పడి హత్యలు కూడా జరుగుతున్నాయన్నారు. మూఢనమ్మకాలు నమ్మవద్దని, వాటిని విడనాడాలని ప్రజలను సూచించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించరూ..

- చంద్రుపల్లి గిరిజనుల వేడుకోలు
- ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా నేతలు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన

చంద్రుపల్లి గిరిజన గ్రామం, పక్కనే గ్రామానికి వెళ్లే కాలిబాట

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు మేజర్ పంచాయతీ పరిధిలోని చింతపల్లి క్యాంపునకు కూతవేటు దూరంలో ఉన్న గ్రామం.. దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటైంది. అయితే నేటికీ కనీస రహదారి సౌకర్యం లేక అక్కడ గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యాసవరాల తోపాటు అనారోగ్య సమస్యలు వంటి అత్యవసర పరిస్థితుల్లోనూ ప్రతి చిన్న అవసరానికి సీలేరుకు వెళ్లాల్సిన పరిస్థితుల్లో నేటికీ వీరికి కాలిబాటే శరణ్యం. ప్రభుత్వాలు, పాలకులెందరు మారినా, నేతలు, అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా తమగోడు పట్టించుకునే నాధులే లేకుండా పోయారని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. చంద్రుపల్లి గిరిజన వాసుల రహదారి కష్టాలపై వివరాలివి.

జికె.వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ చింతపల్లి క్యాంపునకు కూసంత దూరంలో ఉన్న చంద్రుపల్లి గిరిజనులు రోడ్డు సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. 40ఏళ్లక్రితం ఏర్పాటైన తమ గ్రామానికి నేటికీ కాలిబాటే దిక్కుగా ఉందని, దీనిపై పలువురు ఎమ్మెల్యేలు, ఇతర నేతలతోపాటు ఐటిడిఎ పిఒలు, ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏ ఒక్కరూ స్పందించలేదని వాపోతున్నారు. ఇటీవల తమ గ్రామానికి కాలినడకన వచ్చిన ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఏళ్లుగా రోడ్డు లేక తాము పడుతున్న కష్టాలను స్వయంగా పరిశీలించారని, తమ గ్రామానికి సిసిరోడ్డు ఏర్పాటు చేయాలని స్థానిక గిరిజనులు ఆమెను వేడుకున్నారు. గ్రామపంచాయతీ గానీ, ఐటిడిఎ గానీ, ఇతర శాఖల అధికారులుగానీ, నేతలు గానీ చంద్రుపల్లికి రోడ్డు సౌకర్యం కల్పనపై దృష్టి పెట్టకపోవడం విచారకరమని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఏ చిన్న అవసరమైనా కాలినగడకనే సీలేరు వెళ్లి తెచ్చుకుంటున్నామని, ఇక అనారోగ్య సమస్య వస్తే ఇక అంతేసంగతులని అంటున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి చొరవ చూపి తమ గ్రామానికి సిమెంట్ రోడ్డు సౌకర్యం కల్పించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

శిథిల వంతెనను పునర్నిర్మించండి

సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, ఇతర నేతలు

శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జిని పరిశీలిస్తున్న కిరణ్, ఇతర సిపిఎం నేతలు

ప్రజాశక్తి -చింతూరు : మండలంలో బల్లిమెర, చుక్కలపాడు, గ్రామాలను సందర్శించి సమస్యలను తెలుసుకొనడం జరిగిం ది. ఏడుగురాళ్లపల్లి నుంచి పేగ, మల్లంపేట, డి జగ్గారం వెళ్లనున్న ప్రధాన రహదారిలో ఏడుగురాళ్లపల్లి సమీపంలోని గంగనమ్మ వాగుపై శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జిని తక్షణమే పునర్నిర్మించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, ఇతర నేతలు కోరారు. శనివారం ఏడుగురాళ్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో సమస్యలను తెలుసుకునేందుకు జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ ఆధ్వర్యంలోని సిపిఎం బృందం ఆయా గ్రామాలను సందర్శించింది.

ఈ సందర్భంగా గంగనమ్మ వాగుపై పైకప్పు కూలిపోయి, భారీ రంధ్రం ఏర్పడి, ప్రమాదభరితంగా ఉన్న వంతెనను పరిశీలించారు. ప్రధానరోడ్డులోనే ప్రమాదభరితంగా ఉన్న బ్రిడ్జి వద్ద కనీస హెచ్చరికలు పెట్టడంగానీ, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా కనీస మరమ్మతులుగానీ చేపట్టకపోవడం దుర్మార్గమన్నారు. వంతెన మొత్తం కూలి రాకపోకలు నిలిచిపోక ముందే నిధులు మంజూరు చేయించి పునర్నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.

ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ, ఏడుగురాళ్లపల్లి నుండి మల్లంపేట వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని ఆదరాబాదరగా శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, ఇంతవరకు పనులు మొదలెట్టకున్నా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విడ్డూరమన్నారు. వెంటనే ఆ రోడ్డు పనులు చేపట్టి పూర్తి చేయాలని కోరారు. ఏడుగురాళ్లపల్లి, పేగా పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో కనీస సౌకర్యాల కల్పనకు అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం చింతూరు మండల కార్యదర్శి, సీసం సురేష్, కుంజా సీతారామయ్య, మల్లం సుబ్బమ్మ, సవలం కన్నయ్య, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో మేలు

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

ప్రజాశక్తి - రంపచోడవరం : సిఎం జగన్మోహనరెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలితమే గడపగడపలో తమకు లభిస్తున్న జనాదరణకు నిదర్శనమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. శనివారం తామరపల్లి సచివాలయం పరిధిలో గోపవరం, ఈతలపాడు, కోమరవరం గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మికి జనం ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం చేస్తున్న మేలును ప్రతిఒక్కరూ గుర్తుపెట్టుకుని, సిఎం జగన్ పట్ల కృతజ్ఞతాభావంతో ప్రజలు ఉన్నారన్నారు. భవిష్యత్తులో ఇంతకు మించిన పాలన చూడబోతారని భరోసానిచ్చారు. కార్యక్రమంలో రంపచోడవరం ఎంపిపి, జెడ్‌పిటిసి, మండల కన్వీనర్, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, ఎఎంసి చైర్మన్, సీతపల్లి గుడి చైర్మన్, కోఆప్షన్ మెంబరు, సొసైటీ ప్రెసిడెంట్, వైస్‌సర్పంచ్, వార్డ్ సభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, వైసిపి నేతలు, కార్యకర్తలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

డిపిఒ దృష్టికి మురుగు నీటి సమస్య

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామంలో పెద్ద వీధిలో నెలకొన్న మురుగు నీటి సమస్య పరిష్కరించాలని జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణిని గ్రామస్తులు కోరారు. గత ఏడు సంవత్సరాల నుండి పెద్ద వీధిలో డ్రైనేజీ నిర్మాణాలకు ఆటంకం ఏర్పడటంతో మురుగు నీరు పోవడానికి అవకాశం లేకుండా పోయిందని, దీంతో రోడ్డుపై ఉండి పోతుందన్నారు. చాలాకాలం నుండి నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతుందని, దీంతో దోమలు ప్రబలి, రోగాల బారిన పడుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లడంతో సమస్య పరిష్కారానికి మార్గం చూపాలని డిపిఒను ఆదేశించడంతో ఆమె శనివారం సమస్యను నేరుగా పరిశీలించారు. పెద్ద వీధిలో నివాసం ఉంటున్న వారంతా సమస్యను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం పెద్ద వీధిలో జిరాయితీ భూములు ఉన్న వారు 9 అడుగుల స్థలం వదిలి ఇల్లులు నిర్మించుకోవాలని గ్రామ కంఠం స్థలం ఆక్రమించారని, సర్వే చేసి పూర్తిస్థాయిలో నివేదిక అందించాలని సర్వేయర్‌ను ఆదేశించారు. అక్రమంగా గ్రామకంఠంలో నిర్మించుకున్న ఇల్లులను తొలగించాలని వెంకటనారాయణ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌ను ఆదేశించారు.

సూక్ష్మ కళాకారుడు వెంకటేష్‌కు కలెక్టర్ అభినందనలు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ గ్రహీత, సూక్ష్మ కళాకారుడు గట్టెం వెంకటేష్ నివాసానికి శనివారం జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి రావడంతో అతనితో పాటు తల్లిదండ్రులు సూరిబాబు, సత్యవతిలు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ రవి పట్టన్ శెట్టి సూక్ష్మ కళాకారుడు వెంకటేష్‌తో 20 నిమిషాల పాటు మాట్లాడారు. వెంకటేష్ వద్దున్న పురస్కారాలు, సర్టిఫికెట్లు, అవార్డులు, పెన్సిలు ముక్కుతో తయారు చేసిన టూత్ స్టిక్, ఈఫిల్ టవర్, అగ్గిపుల్లలు, పగిలిపోయిన గాజు పెంకులను ఉపయోగించిన తన సూక్ష్మ కళతో ఆయన తయారు చేసిన అనేక కళాకృతులను కలెక్టర్ పరిశీలించి వెంకటేష్‌ను అభినందించారు. వెంకటేశ్ ఆర్ట్స్ పేరుతో ప్రత్యేకంగా తయారు చేసిన కళాఖండాల ఆల్బమ్ కలెక్టర్ పరిశీలించి అభినందించారు. తెలుగు సహా అనేక ఆంగ్ల పత్రికల్లో తన గురించి ప్రచురితమైన కథనాలను కలెక్టర్ కు చూపించారు. ఇటీవల ఉండగా వెంకటేశ్ గీతం వర్శిటీలో ఆర్కిటెక్ట్ విభాగంలో ఇంజనీరింగ్ చదివారు. 13ఏళ్ల పాటు ఎన్నో అద్భుత కళాఖండాలను సృష్టించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు తనకు ఇష్టమైన కళలో విశేష ప్రావీణ్యం పెంచుకున్నాడు. ఫలితంగా 500 వరకూ కళాఖండాలను తయారు చేశాడు.పెన్సిల్ ముల్లుపై అనేక అద్భుత కళాకారులను ఆవిష్కరించాడు. ఎన్నో అవార్డులు, రివార్డులను సొంతం చేసుకున్నాడు. గతంలో రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీతో కూడా అభినందనలు పొందారు. వెంకటేష్ రూపొందించిన అద్భుత సూక్ష్మ కళ ఖండాలను పరిశీలించిన అనేక సంస్థలు వెంకటేష్‌కు ప్రశంసా సర్టిఫికెట్లు ,బహుమతులను అందజేశాయి. ఈ మేరకు వెంకటేష్ కళ నైపుణ్యత, ప్రతిభను పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ వచ్చారు.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఒడ్డుదడపురంలో దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. శనివారం బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనవరి 4న గ్రామానికి చెందిన అగ్రకులం వారు దళితుల పట్ల అవమానంగా మాట్లాడి, దాడికి పాల్పడినట్లు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ నేటి వరకు దాడి చేసిన వారిని ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. వెంటనే అరెస్టు చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని, న్యాయపోరాటం చేస్తామని తెలపారు. ఈ సమస్యను డిజిపి, జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. ఇటువంటి దాడులు పునరావృత్తం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏనుగుపల్లి భాస్కర్, మారుతి సింహాచలం, బోడపాటి సురేష్, దువ్వాడ దావీదు పాల్గొన్నారు.

ఘనంగా రామారావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -పాయకరావుపేట:జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి చైర్మన్, విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిశీలకులు చిట్టాల రామారావు జన్మదిన వేడుకలు శనివారం పాయకరావుపేట పట్టణ అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాయకరావుపేట పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేక్ కట్ చేశారు. రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు అందజేశారు. మండలంలోని పలు గ్రామాల్లోని స్థానిక నాయకులు రామారావు పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు మండలంలోని పెంటకోట గ్రామంలో ఆయన నివాసానికి వెళ్లిన నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ఆందోళన

ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి- పెదబయలు:తమకు ఇచ్చిన మొబైల్ ఫోన్లు పని చేయక పోవడంతో ఇక్కట్లు పడుతున్నామని అంగనావాడీ కార్యకర్తలు శనివారం మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. పని చేయని ఫోన్లు మాకొద్దని నినాదాలు చేశారు. ఫిబ్రవరి 6న చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బోండా సన్నిబాబు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అంగానవాడీలకు వినియోగంలో లేని సెల్ ఫోన్లు సరఫరా చేసిందన్నారు. వీటితో యాఫ్ డౌన్లోడ్ చేసుకుని వివరాలు నమోదు చేయాలని అదికారులు ఒత్తిడి తెస్తున్నారని, గ్రామాల్లో నెట్ సౌకర్యం ఉండదని దీంతో అంగన్‌వాడీలు ఇబ్బంది పడుతున్నారన్నారు. కనీస వేతనం పెంచమంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుంన్నారు. అంగనవాడిల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోలేదని, న్యాయమైన డిమాండ్స్ సాధనకు వచ్చే నెల 6న చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

6న చలో కలెక్టరేట్

ప్రజాశక్తి-పాడేరు:ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఫిబ్రవరి 6న అంగన్వాడి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ఆఫీస్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తున్నట్లు ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే.భాగ్యలక్ష్మి, నాగమ్మ తెలిపారు. శనివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో అంగన్వాడి జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల హాజరుపై ఫేస్ యాప్ తీసుకొస్తుందని, ఇది సమంజసం కాదని తెలిపారు. పెరుగుతున్న ధరలు దృష్టిలో పెట్టుకుని కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రిటైర్మెంట్ బెనిఫిట్ స్కీమ్స్ అమలు చేయాలన్నారు. ఉద్యమాలు అణిచి వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 1ని తక్షణం రద్దు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.వెంకటలక్ష్మి, కే.కొండమ్మ, లక్ష్మి, వి.రాధ, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి

పెదలబుడు సర్పంచ్ దాసుబాబు

మాట్లాడుతున్న సర్పంచ్ దాసుబాబు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్:నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేంచేందు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు అన్నారు. పెదలబుడు పంచాయతీ పరిధిలోని గిరి గ్రామదర్శినిలో భాగంగా శనివారం యువతతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ పెట్టెలి దాసుబాబు మాట్లాడుతూ, పెదలబుడు పంచాయతీ పరిధిలో వివిధ నైపుణ్యాలు కలిగిన యువత నిరుద్యోగులుగా ఉన్నారని, వీరికి స్వయం ఉపాధి మార్గాలు చూపించే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గిరిజన మ్యూజియం, పర్యాటక సంస్థల్లో స్వయం ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వివిధ రంగాలలో నైపుణ్యం కలిగిన యువతకు ముద్ర వంటి రుణాలను ఇప్పించి వారికి స్వయం ఉపాధి దిశగా సహకారం అందిస్తామని పేర్కొన్నారు. అరకులోయ పర్యాటక ప్రాంతం కావడంతో వేల సంఖ్యలో పర్యాటకులు ఇక్కడకి వస్తున్నారని, దీని దృష్ట్యా గిరిజన సాంప్రదాయ వంటకాల పై ప్రత్యేక చర్యలు చేపట్టాలని అభిప్రాయపడ్డారు.పెదలబుడు పంచాయతీ పరిధిలో గిరిజన యువతకు గిరిజన సాంప్రదాయ రుచులు, వంటకాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. గిరిజన సంప్రదాయ వంటకాలతో కూడిన ఫుడ్ కోర్టును తొలిసారిగా అరకులోనే ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భీమరాజు, ఎంపీటీసీ శత్రుగున్, వార్డు సభ్యులు త్రినాధ్, వార్డు సభ్యులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన

మాట్లాడుతున్న ఎఒ మోహనరావు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గిరిజన రైతులకు చిరుధాన్యాల సాగుపై శనివారం అవగాహన కల్పించినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి పీ.మోహన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన రైతులకు పంటల సాగు పోషక విలువలపై తెలియజేశామన్నారు. మండలంలో సుమారుగా 5500 ఏకరాల్లో చిరు ధాన్యాల సాగును చేపడుతున్నారని తెలిపారు.మండలంలో ఎక్కువ క్లస్టర్స్ ఏర్పాటు చేసుకుంటే ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడానికి సులువుగా ఉంటుందని మండల వ్యవసాయ అధికారి పొలిమేర మోహనరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన రైతు సోదరులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గవర్నర్ ప్రసంగంలో అన్నీ అబద్ధాలే : అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్:గణతంత్ర దినోత్సవం రోజున గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌తో రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు అన్నీ అబద్దాలు చెప్పించారని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు విమర్శించారు. శనివారం ఆయన మీడియాకు ఒక వీడియోను విడుదల చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం గవర్నర్ ప్రసంగంలో గత సంవత్సర కాలంలో చేసిన పనులు, చేయబోవు కార్యక్రమాలు వివరించడం ఆనవాయితీ అన్నారు. ఏమీ చేయకపోయినా చేసినట్లు గవర్నర్‌తో చెప్పించారన్నారు. ముఖ్యంగా విద్యా విధానం గత మూడున్నర సంవత్సరాల కాలంలో 30వేల పాఠశాలలు మూసివేశారన్నారు. ఈ విషయం గవర్నరికి తెలియదా అని ప్రశ్నించారు. రైతులు పండించిన పంట గిట్టుబాటు ధర లేక కొనేవాడు లేక రైతులు గగ్గోలు పెడుతున్నారని, సుగర్ ఫ్యాక్టరీలు మూసివేశారని తెలిపారు. ఆసుపత్రుల్లో డాక్టర్స్ లేరన్నారు. ముఖ్యంగా ఆసుపత్రుల్లో జనరేటర్లకు డీజిల్ కొట్టేందుకు కూడా డబ్బులు లేని పరిస్థితి ఉందన్నారు. రహదారులు అధ్వాన్నంగా ఉన్నా గవర్నర్ తన ప్రసంగంలో 5181 కిలోమీటర్లు రోడ్లు వేశామని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తానని చెబుతున్నారని, తెలుగుదేశం ప్రభుత్వ సమయంలో 80 శాతం పూర్తి చేసిన పనులు నేటికీ కనీసం 5 శాతం పనులు కూడా చేయలేదన్నారు. మరి ఏ విధంగా పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. 25 లక్షలు ఇళ్ల కడతానని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి కనీసం 25 వేలు కూడా కట్టలేదని తెలిపారు. లక్షా 80వేలు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే డబ్బులు మాత్రమే ఇస్తున్నార న్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు ఎక్కడా ఇవ్వ లేదన్నారు. ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పూర్తిగా దారి మళ్లించిందని విమర్శించారు.

వసతి గృహం ప్రారంభం

ప్రజాశక్తి-మాకవరపాలెం:మండలంలో కొండల అగ్రహారంలో ఇమ్మాన్యాయేలు సంస్థ ఆధ్వర్యాన నర్సింగ్ విద్యార్థులకు కొత్తగా నిర్మించిన నూతన వసతి గృహాన్ని శనివారం జర్మనీ దేశస్తులతో పాటు సంస్థ అధినేత జీవన్‌రాయ్ ప్రారంభించారు. అనంతరం జీవన్ రాయ్ మాట్లాడుతూ, నర్సింగ్ విద్యార్థులు 160 మంది ఉండేటట్లు వసతి గృహం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దీంతో నర్సింగ్ విద్యార్థులకు వసతి సమస్య తీరుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోని కోణం పంచాయతీ శివారు జాజులపాలెం గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త పట్నం రామారావు అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు, మండల వ్యవసాయ సలహా కమిటీ ఛైర్మన్ ఎర్ర అప్పారావు, నాయకులు లాలం జానకిరామ్, కురచా నారాయణమూర్తి, కిమిడి సన్యాసిరావు, మట్ట బాబురావులు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ఆర్థిక సహాయంతో రూ.5 వేలను మతుని కుమారుడికి అందించారు. ప్రభుత్వపరంగా వచ్చే రాయితీలను ఆ కుటుంబానికి అందే విధంగా చూస్తామని నాయకులు హామీ ఇచ్చారు

30న బహుజన చైతన్య సభ : నాగరాజు

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్:నర్సీపట్నం సిబిఎం కాంపౌండ్ వద్ద ఈనెల 30న జరిగే బహుజన చైతన్య సభను జయప్రదం చేయాలని బిఎస్పీ జిల్లా ఇన్చార్జ్ బొట్టా నాగరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు సభకు సంబంధించి ప్రచారాన్ని శనివారం ఆయన ప్రారంభిం చారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న బహుజన రాజ్యాధికార యాత్ర నర్సీపట్నం ఈనెల 30న వస్తున్న నేపథ్యంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. బహుజనులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీనియర్ బహుజన వాది పెద కుమార్ బాబు మాస్టారు ఈ ఆటో ప్రచార రథానికి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గంగాధర్, అప్పలనాయుడు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పశుపోషణపై అవగాహన

ప్రజాశక్తి-రోలుగుంట:శాస్త్రీయ పశుపోషణలో అవగాహన పెంపొందించేందుకు శనివారం మండలంలోని కొండపాలెం రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పశు విజ్ఞాన బడిని పశువైద్యాధికారి నూకేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి డాక్టర్ బి.ప్రసాదరావు మాట్లాడుతూ, పాల కేంద్రంనకు తీసుకెళ్లే వరకు పాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఇతర పశుసంవర్ధక పథకాలు సద్వినియోగం చేసుకొని లాభదాయకమైన పశుపోషణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు భానుబాబు, కుమార్‌లు పరిశుభ్ర పాల ఉత్పత్తి రైతుల భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ యశోద, సిబ్బంది శ్రీనివాస్, శివ, వల్లిక రాజు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకం అందిస్తున్న ప్రిన్సిపల్ వినోద్‌బాబు

ప్రతిభకు ప్రోత్సాహం

ప్రజాశక్తి - సీలేరు : విద్యార్థులు సరైన ప్రణాళిక. క్రమశిక్షణ, అంకితభావంతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అందిపుచ్చుకోవచ్చని సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వినోద్‌బాబు విద్యార్థులకు సూచించారు శనివారం కాలేజీలో చదువులో మంచి ప్రతిభను కనబరిచి, ఆయా గ్రూపుల్లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలిచ్చి అభినందించారు. అత్యధిక మార్కులు సాధించిన సిఇసి గ్రూపు విద్యార్థిని కె.పుష్ప, హెచ్ఇసి విద్యార్థిని పి.మౌనికలకు చెరో రూ.500నగదు ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా సిఇసి విద్యార్థులకు ఎంబిఎ, సిఎ, హెచ్ఇసి గ్రూపు విద్యార్థులు డిగ్రీ అనంతరం గ్రూప్స్, సివిల్స్ వంటి పోటీపరీక్షలకు సన్నద్ధం కావడం ద్వారా తమ భవిష్యత్‌ను బంగరుమయం చేసుకోవచ్చున్నారు. ఇవేకాక వారికి ఆసక్తి ఉన్న ఎన్నో కోర్సులు, రంగాలు ఉన్నాయని, అయితే లక్ష్యాన్ని సాధించేందుకు కఠోరంగా శ్రమించాల్సిన అవసరం ఉందన్నారు.

పెరిగిన అవినీతితో ప్రజలకు నష్టం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో పెరిగిన అవినీతి కారణంగా ప్రజలు నష్టపోతున్నారని రాజ్యసభ ఎంపీ జివిఎల్.నరసింహారావు అన్నారు. టిడిపితో విసిగిపోయిన ప్రజలు వైసిపిని గెలిపిస్తే వారేం ఒరగబెట్టారని ఎద్దేవా చేశారు. శనివారం స్థానికంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయనతో పాటు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణుకుమార్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే మహిళా సంక్షేమ విభాగం అధ్యక్షురాలు పారిజాత సత్పతి నేతృత్వంలో స్థానిక రైల్ క్లబ్‌లో యోగా, రథ సప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇక్కడ 15 రోజులుగా యోగాసనాలు - సూర్య నమస్కారాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ముగింపు వేడుకకు హాజరైన పారిజాత సత్పతి మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన రైల్వే డిఆర్ఎం అనుప్ సత్పతి మాట్లాడుతూ సూర్య నమస్కారాల నేపథ్యాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో అధికారులు మనోజ్ కుమార్ సాహూ, సుధీర్ కుమార్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు. జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో సామూహిక సూర్య నమస్కారాల కార్యక్రమం చేపట్టారు. ఓం ఉచిత యోగా సెంటర్ వ్యవస్థాపకులు, జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చిలకా రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా స్టీల్ విక్రేతల సమావేశం

ప్రజాశక్తి-ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో మొదటిసారిగా జాతీయ స్థాయిలో స్టీల్ అమ్మకపుదారులతో యాజమాన్యం సమావేశమైంది. ఉక్కునగరంలోని స్టీల్ క్లబ్ శనివారం దీనికి వైదికైంది. స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి అతుల్ భట్, ఫైనాన్స్ డైరెక్టర్ వివి.వేణుగోపాలరావు, వాణిజ్య విభాగం డైరెక్టర్ మహంతి, ప్రాజెక్ట్స్ డైరెక్టర్ ఎకె బగ్చి తదితరులు హాజరయ్యారు. దేశ నలుమూలల నుంచి సుమారు 200 మంది విక్రేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రగతిలో విక్రేతలు కూడా ముఖ్య పాత్ర పోషిస్తున్నారని, అలాంటివారిని అభినందించడం కోసమే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. తయారీదారులు, వ్యాపారుల భాగస్వామ్యంతో వ్యాపారం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమం నిర్వహణకు కృషి చేసిన మెటీరియల్ మేనేజ్‌మెంట్ విభాగాన్ని ఆయన అభినందించారు. విక్రేతదారులను ఉద్దేశించి కమర్షియల్ డైరెక్టర్ డికె.మహంతి మాట్లాడుతూ విక్రేతదారులు సహేతుకంగా టెండర్ కోడ్ చేయాలని, డెలివరీ షెడ్యూల్‌కు కట్టుబడి ఉండాలని సూచించారు. మేకిన్ ఇండియా, ఆత్మ నిర్భర భారత్‌పై భారత ప్రభుత్వ మార్గదర్శకాలను స్టీల్ ప్లాంట్ కచ్చితంగా అనుసరిస్తుందని తెలిపారు. మరింతమంది విక్రేతదారులను రిజిస్టర్ చేసుకోవడానికి స్టీల్‌ప్లాంట్ సిద్ధంగా ఉందన్నారు.

బతుకు భయం

హెటిరో రెండో పైపులైన్‌తో మత్స్యకారుల్లో ఆందోళన
చేపల లభ్యతపై సంస్థకు అనుకూల నివేదిక
వేట లేక పెరుగుతున్న వలసలు
కలుషితమైన ఉప్పుటేరు, కంపుకొడుతున్న మత్స్యసంపద

హెటిరో వ్యర్థాల వల్ల కలుషితమవుతున్న ఉప్పుటేరు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి విలేకరి

జిల్లాలోని నక్కపల్లి హెటిరో డ్రగ్స్ కంపెనీ రెండో పైప్‌లైన్‌కు ప్రభుత్వాలు అనుమతులివ్వడంపై మత్స్యకారుల్లో అలజడి నెలకొంది. పుట్టి, పెరిగి బతుకుతున్న వూరిలో వుండనివ్వరా ? అని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. 'ప్రస్తుత పైప్‌లైన్‌లో హెటిరో విడిచిపెట్టిన వ్యర్థాలతో సముద్రంలో చేపలు దొరక్క, వలసెల్లిపోతున్నాం. రెండో పైప్‌లైన్‌వేసి ఉన్న జనాలను కూడా వూర్లో వుండనివ్వరా ?' అని ప్రశ్నిస్తున్నారు. రెండో పైపులైన్‌కు అనుమతులివ్వొద్దని 2021 డిసెంబరు ఒకటి నుంచి రాజయ్యపేట, బోయపాడు, పెదతీనార్ల, చినతీనార్ల, దొండవాక, అమలాపురం మత్స్యకారులు ఆందోళన చేస్తున్నారు. వీరంతా తమ జీవనోపాధిని దెబ్బతీసే కంపెనీ పైప్‌లైన్‌కు అనుమతులివ్వొద్దని ఏకోన్ముఖంగా చెబుతున్నారు. అయినా వారి విన్నపాలేవీ వినకుండా, వారి బతుకుదెరువుపై ఆలోచించకుండా ఏకపక్షంగా కంపెనీకి ఒక్కొక్క అనుమతులిచ్చుకుంటూ పోవడంతో ఊర్లో వుండలేమన్న భయం మత్స్యకారుల్లో అలముకుంది. కంపెనీ ఉత్పత్తి ప్రారంభించాక సముద్ర ఒడ్డుకు సమీపంలో చేపలు దొరకని పరిస్థితి ఏర్పడింది. పైప్‌లైన్ నుంచి విడుదల చేసిన వ్యర్థాల వల్ల చేపలు దొరక్క సముద్రం లోలోపలకు మత్స్యకారులు వెళ్తున్నారు.

పడిపోయిన ఆదాయాలు

చేపలు దొరక్కపోవడంతో మత్స్యకారుల ఆదాయాలు పడిపోయాయి. రోజుకు ఒకసారి వేటకు వెళితే వారానికి రెండు, మూడు వేల రూపాయలు వచ్చే ఆదాయం, ఇప్పుడు రెండు సార్లు వేటకు వెళ్తున్నా వెయ్యి రూపాయలు కూడా రావడం లేదని మత్స్యకారులు 'ప్రజాశక్తి' వద్ద వాపోయారు. ఒక్కోసారి డీజిల్ డబ్బులు కూడా రావడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. వేటలేక... ఆదాయంరాక కుటుంబాలను పోషించుకోలేని మత్స్యకారులు తమ కుటుంబాలను తీసుకొని వలస వెళ్లిపోతున్నారు. రాజయ్యపేటలో కంపెనీ రాకముందు 200 పడవులుండేవి. ఇప్పుడవి 110కి తగ్గాయి. అందులో 80 బోట్లను అమలాపురం, తూర్పుపాలు, వాసాలతిప్ప, యానాం, గచ్చకాయలపర, నీలరేవు, మచిలీపట్నం, నెల్లూరు, ఒడిశా, కోనార్క్, విశాఖపట్నం, పలాస, తుంగభద్ర, పారాదీప్, శ్రీశైలం డ్యామ్ ఇలా వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లి చేపలు వేటాడుతున్నారు. సముద్రంలో చేపలు దొరక్క ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి బతుకుతుంటే, చేపల లభ్యత బాగుందని మత్స్యశాఖ ఎలా నివేదిక ఇచ్చిందని మత్స్యకారులు ప్రశ్నిస్తున్నారు. కంపెనీ పరిసరాల్లో సముద్రంలో చేపలు లేక, వలస వెళ్లలేక నిర్మాణ, వ్యవసాయ పనులకు వెళ్తున్నట్లు తెలిపారు. వాస్తవ పరిస్థితి ఇలావుంటే చేపల ఉత్పత్తి బాగుందని నివేదిక ఇవ్వడం.. కంపెనీకి మేలు చేసి, మత్స్యకారులకు కీడు చేయడానికేనని మత్స్యకారులు అంటున్నారు.

ఉప్పుటేరు వద్దా సమస్యే..

తుపాన్లు వచ్చినప్పుడు, సముద్రంలో వేట నిషేధ కాలంలోనూ, సముద్రంలో వేటాడే శక్తిలేని వాళ్లు, పిల్లలు పట్టించుకోని వయస్సు కలిగిన మత్స్యకారులకు ఒకప్పుడు పెద్ద ఆధారంగా ఉప్పుటేరు వుండేది. ఇప్పుడు దానిలో చేపల లభ్యత తగ్గి, వాసన రావడంతో పట్టిన చేపలు అమ్ముకొనేందుకు అనేక అవస్థలు పడుతున్నామని వాపోయారు. కంపెనీ వచ్చాక తమ జీవనోపాధి పోయిందని మత్స్యకారులు ఆందోళన చెందుతుండగా, కంపెనీ ప్రతినిధి సుబ్బారెడ్డి మాత్రం వ్యర్థాలను శుద్ధిచేసి సముద్రంలోకి విడిచిపెడుతున్నామని చెప్పుకొచ్చారు.

రెండో పైప్‌లైన్ వేస్తే బతకలేం

కంపెనీ రాకముందు సముద్రం ఒడ్డునే ఎక్కువ సమయం గడిపేవాళ్లం. ఇప్పుడు వాసనకు భయపడి వెళ్లాలనిపించడంలేదు. మొదటి పైపులైన్ వల్ల మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింది. ఇంకా రెండో పైప్‌లైన్ వస్తే బతకడమే కష్టం. గతంలో పైప్‌లైన్‌కు తగిలి దెబ్బతిన్న వలలకు కంపెనీ పరిహారం చెల్లించేది. ఇప్పుడు ఆ పరిహారమూ ఇవ్వడం మానేశారు. ఇంత నష్టపోతున్న గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి కంపెనీ ముందుకు రావడంలేదు. విద్యార్హత కలిగిన వారికి ఉద్యోగాలు ఇవ్వడంలేదు. రెండో పైపులైను అనుమతులు వెనక్కు తీసుకొనే వరకూ పోరాటం కొనసాగిస్తాం. పోరాటం తప్ప మరో మార్గం మత్స్యకారులకు లేదు.

మైలపల్లి మహేష్‌బాబు, 10 వార్డు మెంబరు, రాజయ్యపేట

పైప్‌లైన్ వేయొద్దు

ప్రజలకు హానిచేసే హెటిరో రెండో పైప్‌లైన్‌కు ప్రభుత్వాలు అనుమతులివ్వడం సరికాదు. మత్స్యకారుల బతుకులు పాడుచేయొద్దు. పైప్‌లైన్ వేయొద్దు. బలవంతంగా వేయాలని ప్రయత్నిస్తే కలిసికట్టుగా అడ్డుకుంటాం.

గోసల సోమేశ్వరరావు,
తెప్పల బోట్లు సంఘం అధ్యక్షుడు, రాజయ్యపేట

రాజయ్యపేట రేవు చేపలు కొనడంలేదు

హెటిరో కంపెనీ వదులుతున్న కలుషిత నీరు వల్ల సముద్రంలోనూ, ఉప్పుటేరులోనూ చేపలు దొరకడంలేదు. దొరికిన చేపలు వాసన కొట్టడంతో కొనడానికి ఎవరూ ముందుకురావడంలేదు. రాజయ్యపేట రేవంటేనే వెనక్కు తగ్గుతున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్నాం. కంపెనీ నిర్మాణ కాలంలో ఇచ్చిన హామీలేవీ అమలుకాలేదు.

పిక్కి నాగరాజు, రాజయ్యపేట గ్రామ పూజారి

ఉన్న పైప్‌లైన్‌ను సర్దుబాటు చేసుకోవాలి

ప్రస్తుతమున్న పైప్‌లైన్‌తో సర్దుబాటు చేసుకోవాలి తప్ప కొత్తగా పైప్‌లైన్ వేయకూడదు. జనాలకు ఇబ్బందిలేకుండా వ్యర్థాలను శుద్ధిచేసి సముద్రంలోకి వదలాలి.

గోసల కాసులమ్మ, జెడ్‌పిటిసి, నక్కపల్లి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెఎసి ఛైర్మన్ జగ్గునాయుడు, తదితరులు

ఉక్కు ప్రజా గర్జన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 30వ తేదీ సాయంత్రం 3 గంటలకు ఉక్కు నగరంలోని తృష్ణా మైదానంలో జరుగనున్న ఉక్కు ప్రజా గర్జనను జయప్రదం చేయాలని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి పిలుపునిచ్చింది. జగదాంబలోని సిఐటియు కార్యాలయంలో శనివారం జెఎసి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉక్కు ప్రజా గర్జన పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తామని మోడీ ప్రకటించి ఈ నెల 27కి రెండేళ్లు పూర్తయిందని, నాటి నుంచి నేటి వరకూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని వివిధ రూపాల్లో ఆందోళన, పోరాటాలు కొనసాగుతున్నాయని తెలిపారు. అయినప్పటికీ మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తాం లేదా మూసేస్తామని ప్రకటించడం దారుణమన్నారు. మోడీ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఉక్కు ప్రజా గర్జన సభ జరుగుతుందని తెలిపారు. మోడీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందన్నారు. విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అని నినదిస్తూ 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసేందుకు చూడటం దుర్మార్గమన్నారు. పెద్ద ఎత్తున సభలు, మానవహారాలు, సమ్మెలు, రాష్ట్ర బంద్‌లు నిర్వహించినా ప్రభుత్వం నిర్ణయాల్లో మార్పు రాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ ఏకగ్రీవంగా తీర్మానాలు చేసినా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో మార్పు రాలేదని తెలిపారు. రెండేళ్ల నుంచి కార్మిక, ప్రజా సంఘాలు తమ శక్తి మేరకు పోరాడుతున్నాయన్నారు. ఇప్పుడు 'ఉక్కు ప్రజా గర్జన'కు రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులందరినీ ఆహ్వానించామన్నారు. రాజకీయాలను పక్కన పెట్టి విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం జరుగుతున్న పోరాటంలో పాల్గొనని వారు చరిత్ర హీనులుగా, దేశద్రోహులుగా మిగిలిపోతారని తెలిపారు. కార్యక్రమంలో కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు మంత్రి రాజశేఖర్, ఎఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి ఎం.మన్మధరావు, వైఎస్ఆర్‌టియుసి జిల్లా అధ్యక్షులు వై.మస్తానప్ప, హెచ్ఎంఎస్ జిల్లా నాయకులు దొమ్మేటి అప్పారావు, సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు కనకారావు, ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు గండి నాయినబాబు పాల్గొన్నారు.

పిఎంజె వివాహ ఆభరణాల ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రసిద్ధ ఆభరణాల బ్రాండ్ పిఎంజె జ్యూయలర్స్ వివాహ ఆభరణాల ప్రదర్శన శనివారం బీచ్ రోడ్డులోని నొవొటెల్ హోటల్‌లో ఘనంగా ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనను విఎంఆర్‌డిఎ ఛైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, జివిఎంసి అడిషనల్ కమిషనర్ సన్యాసిరావు అతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ వివాహ సీజన్‌లో ఇంత భారీ ఆభరణాల ప్రదర్శన వైజాగ్‌లో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పిఎంజె సేకరించిన విశిష్ట ఆభరణాలు ఈ ప్రదర్శనలో వినియోగదారులను తప్పక ఆకర్షిస్తాయన్నారు. పిఎంజె జ్యూయలర్స్ వైజాగ్ హెడ్ ఆనంద్ జిలగం మాట్లాడుతూ ఈ భారీ ఆభరణాల ప్రదర్శనలో పది వేలకుపైగా వెడ్డింగ్ కలెక్షన్లు ఉన్నాయన్నారు.

ఇపిడిసిఎల్ సర్కిల్ కార్యాలయంలో లిఫ్ట్ ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఇపిడిసిఎల్ విశాఖపట్నం సర్కిల్ కార్యాలయంలోని లిఫ్ట్, క్రెచ్‌ను సంస్థ సిఎమ్‌డి కె.సంతోషరావు శనివారం ప్రారంభించారు. లిఫ్ట్ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, వినియోగదారులకు ఎంతో ఉపయోగకరంగా వుంటుందని ఆయన అన్నారు. రూ.28 లక్షల వ్యయంతో లిఫ్ట్‌ను తక్కువ కాలంలో వినియోగంలోకి వచ్చేలా కృషి చేసిన సర్కిల్ ఎస్ఇ మహేంద్రనాథ్‌ను అభినందించారు.